క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి



ఎర్దండిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని, మండలంలోని గ్రామాల్లో కళాశాల అధ్యాపకులు బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరితే, ఉచిత విద్యతో పాటు, పాఠ్యపుస్తకాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు అనుభవంతో చక్కటి బోధన అందిస్తున్నారని వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇంగ్లిష్ మీడియంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు సంతోష్‌కుమార్, నియాజ్ హమ్మద్, రతన్ సింగ్, నాగరాజు, అనూష, రజిత, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



నర్సరీ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో,అధికారులు

మల్యాల: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో కనకదుర్గ అన్నారు. మండలంలోని ముత్యంపేట, నూకపల్లి గ్రామాల్లో బుధవారం నర్సరీలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పారిశుధ్య నిర్వహణను డీఎల్‌పీవో కనకదుర్గ పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కళావేదికను పునర్నిర్మించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న లలిత కళా సమితి సభ్యులు

మెట్‌పల్లి: మెట్‌పల్లి ఖాదీ ఆవరణలోని తొలగించిన కళావేదికను పునర్నిర్మాణం చేయాలని లలిత కళాసమితి సభ్యులు డిమాండ్ చేశారు. కళావేదికను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ వారంతా బుధవారం ఖాదీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దకాలంగా ఉన్న కళావేదికలో ఎన్నో సాంస్కృతిక, ఇతర కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. నూతన కళావేదికను వెంటనే నిర్మించాలన్నారు. కార్యక్రమంలో లలిత కళా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోరుట్ల: పట్టణంలోని వాసవి కల్యాణ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో బుదవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి రూ. 60 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్లు అనూప్ రావ్, దిలీప్‌రావు, రేగొండ రాజేశ్,అన్వేశ్, అనూప్, ప్రియాంక, శృతి,నరేశ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ అల్లాడి శోభా, కోరుట్ల అధ్యక్ష, కార్యదర్శులు వనపర్తి చంద్రమోహన్,కుందారపు మహేందర్, కోశాధికారి కొండబత్తిని కృష్ణప్రసాద్,లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ తల్లి ఆలయానికి ఎంపీపీ తోట నారాయణ బుధవారం రూ. 25 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో బాస గంగారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖయ్యూం, మారుతి, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సమస్యలపై విప్ ప్రశ్నించడంతో అధికారుల తడబాటు



ఏవో యోగితాను ప్రశ్నిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: అధికారులు అంకిత భావంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ జవ్వాజి రేవతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ పలు సమస్యలపై నేరుగా ఆయా శాఖల అధికారులను ప్రశ్నించడంతో వారు సమాధానమిచ్చేందుకు తడబడటం గమనార్హం. జీలుగ విత్తనాలు సరిపడా వచ్చాయా? మండలానికి ఎన్ని క్వింటాళ్లు అవసరమో ముందస్తుగా గుర్తించారా లేదా అని ఏవో యోగితాను విప్ అడిగారు. తాండ్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఒక్క రైతు ఆధార్‌కార్డు పలువురికి అనుసంధానం చేయడంతో రైతుబీమా వర్తించని పరిస్థితులు ఏర్పడ్డాయని, రైతుబంధు డబ్బులు రావడంలేదని, ఏళ్లుగా ఎందుకు జాప్యం చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా చర్చించి తప్పులను సరిచేయాలన్నారు. రైతులు కోరిన విత్తనాలు డీలర్లు ఇచ్చేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు వారి స్థాయిలో సరిగా పనిచేయాలన్నారు. వర్షాకాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో వర్షపు నీరు నిలిచే అవకాశం ఉంటే ముందస్తుగా గుర్తించి నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాలు మారినప్పుడు ఆలోచనలు మారుతాయని, అధికారులు అందుకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. తాండ్ర్యాల ఎక్స్ రోడ్డు, తుర్తి, రాజారాం తండా గ్రామాల్లోనే రేషన్ సరుకులు అందించాలని, దీనికి వెంటనే ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు సూచించారు. హరితహారంలో మొక్కలు నాటుతున్నారని.. వాటి రక్షణపై దృష్టి సారించడం లేదని ఎంపీపీ రేవతి ప్రశ్నించారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఒడ్నాల రాజశేఖర్ ఎన్నిక చెల్లదు'

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య



మాట్లాడుతున్న మున్నూరు కాపు నాయకులు

జగిత్యాలటౌన్: మున్నూరుకాపు జిల్లా అధ్యక్షుడినని చెప్పుకుంటున్న ఒడ్నాల రాజశేఖర్ ఎన్నిక చెల్లదని, సంఘం ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని గోవింద్‌పల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన మున్నూరుకాపుల జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర సంఘం అనుమతి లేకుండా వొడ్నాల రాజశేఖర్ తనకు తానుగా జిల్లా అధ్యక్షుడినని, రమణ కార్యదర్శి అని ప్రకటించడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక నిర్వహించేందుకు 9మందితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల జాబితాతోసహా ఎన్నికల నిర్వహణను కమిటీ చూస్తుందన్నారు. అన్ని మండలాల్లో సభ్యత్వ జాబితా తయారు చేసి జిల్లా కమిటీ వేస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ జిల్లా అధ్యక్షుడిగా బాదినేని రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా బండారి రాజ్‌కుమార్ కొనసాగుతారని స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అరిగెల అశోక్, హరి అశోక్‌కుమార్, బైరం హరికిరణ్, కందుకూరి రవిబాబు, జంగిలి మల్లికార్జున్, కొలగాని శ్రీనివాస్, సాయిని పాపన్న, చెదలు సత్యనారాయణ, పడాల తిరుపతి, గంగం జలజతోపాటు జిల్లా అధ్యక్షుడు బాదినేని రాజేందర్, కోశాధికారి దీటి అంజయ్యతోపాటు మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలి రావడం లేదని నిరసన

మేడిపల్లి: ఉపాధి హామీలో పనిచేసిన తమకు కూలి చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మాచాపూర్ కూలీలు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని ఈజీఎస్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేశారు. సుమారు 200 మంది కూలీలు తరలివచ్చారు. పనులు చేసిన తమకు కూలి తగ్గించి ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఎండలు మండుతున్నా.. మధ్యాహ్నం వరకు పనిచేస్తున్నామన్నారు. దీనిపై ఉపాధి హామీ ఈసీ నవీన్ మాట్లాడుతూ కూలి తక్కువ రావడం అవాస్తవమని, సమస్య ఎక్కడుందో గ్రామసభ నిర్వహించి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కూలీలు శాంతించారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రం

జగిత్యాలజోన్: మహిళలకు అండగా సఖీ కేంద్రం పనిచేస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, సంక్షేమాధికారి వాణిశ్రీ తెలిపారు. రూరల్ మండలం మోతె గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళలపై హింస, అత్యాచారాలు జరిగినప్పుడు నిర్భయంగా పోలీసులు, సఖీ కేంద్రాల నిర్వాహకులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ లావణ్య, సైకో సోషల్ కౌన్సిలర్ గౌతమి, రాష్ట్ర అధ్యక్షురాలు స్వర్ణలత, కృష్ణతేజ పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లి: పాఠశాలలో అడ్మిషన్‌తో పాటు రాయితీ ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఒకరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన గుంటుక జయప్రకాశ్ అనే వ్యక్తి తన కుమారుడు ప్రణవ్‌తేజ్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించుకున్నాడు.ఈ విషయం అతని స్నేహితుడు నరేశ్‌కు చెప్పాడు. ఆయన జగిత్యాలకు చెందిన కుసుంబ నిఖిల్‌ను సంప్రదించాలని చెప్పడంతో కలిశాడు. ఇందుకు నిఖిల్ ఎలాగైన అడ్మిషన్ ఇప్పించడంతో పాటు రాయితీ సైతం ఇప్పిస్తానని నమ్మబలకడంతో జయప్రకాశ్ రూ. 1.8లక్షలు దశల వారిగా నిఖిల్‌కు ఫోన్‌పే ద్వారా పంపగా, డబ్బులు చెల్లించినట్లు పాఠశాల పేరు మీద నకిలీ రశీదులను వాట్సప్‌లో పంపాడు. రశీదులను పాఠశాలలో చూపిస్తే అవి నకిలీవని చెప్పడంతో మోసపోయాయని గ్రహించి నిఖిల్‌ను నిలదీయగా తిరిగి బెదిరించాడు.దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తాం



డ్రెయినేజీ నిర్మాణ స్థలం పరిశీలిస్తున్న ఎస్ఈ

ఇబ్రహీంపట్నం: డ్రెయినేజీ పనులను వెంటనే ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ డీఈ వెంకటరమణ తెలిపారు. బుధవారం మండలంలోని గోధూర్‌లో రోడ్డు పక్కన నిర్మించనున్న పెద్ద డ్రెయినేజీ నిర్మాణ స్థలాన్ని ఎస్ఈ చందర్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. గ్రామంలోని మురికి నీరంతా పొలాల్లోకి వస్తోందని పలువురు రైతులు అధికారులకు విన్నవించగా, పట్టించుకోకపోవడంతో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు విన్నవించారు. స్పందించిన ఆయన డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 70 లక్షలు మంజూరు చేయించారు. గతేడాది జూన్ లో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాగా, కొంత మంది ఇళ్ల యాజమానులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఎస్ఈ చందర్‌సింగ్,డీఈ వెంకటరమణ వచ్చి పరిశీలించి, వేంకటేశ్వర ఆలయం నుంచి ఇబ్రహీంపట్నానికి వెళ్లే దారిలో కల్వర్టు వరకు డ్రెయినేజీ నిర్మించేందుకు నిర్ణయించారు. డ్రెయినేజీ నిర్మాణం లోతుగా ఉంటుందని, చుట్టు పక్కల వారు అందులో పడకుండా దానిపై స్లాబ్ పోసేందుకు నిర్ణయించినట్లు డీఈ తెలిపారు. కార్యక్రమంలో ఎడపెల్లి వెంకటస్వామి, కాంట్రాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఏఈగా జ్ఞానేశ్వర్



జ్ఞానేశ్వర్

కథలాపూర్: పంచాయతీరాజ్ శాఖ మండల ఏఈగా వేముల జ్ఞానేశ్వర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఏఈ ఆదిత్య జగిత్యాలకు బదిలీ అయ్యారు. మల్యాల మండలంలో ఏఈగా పనిచేస్తున్న జ్ఞానేశ్వర్‌కు కథలాపూర్ మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఏఈ జ్ఞానేశ్వర్ బుధవారం ప్రజాప్రతినిధులను, అధికారులను పరిచయం చేసుకున్నారు.

బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడిగా రామకృష్ణ శర్మ



రామకృష్ణ శర్మ

కోరుట్ల: బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడిగా పాలెపు రామకృష్ణ శర్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల పరిశీలకులు బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, నేరెళ్ల రామకృష్ణ శాస్త్రి, తత్వాది రాజేంద్ర ప్రసాద్ శర్మ బుధవారం ప్రకటించారు. రెండేళ్ల పాటు అధ్యక్షుడిగా రామకృష్ణ శర్మ కొనసాగుతారని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ శర్మను పలువురు అభినందించారు.

'అవినీతిపై కోరుట్ల ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలి'



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్: కోరుట్ల నియోజకవర్గంలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో బుధవారం మాట్లాడారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, తండ్రి కల్వకుంట్ల విద్యాసాగర రావు చేసిన అవినీతి, అక్రమార్జన, మోసాలపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు కుటుంబం నియోజకవర్గాన్ని దోచుకుందని ఆరోపించారు. నియోజకవర్గంలో జువ్వాడి నర్సింగరావు ఐదు సార్లు ఓడిపోయాడని ఎమ్మెల్యే మాట్లాడటం ఆయనకు నియోజకవర్గంపై ఎంత మాత్రం అవగాహన లేదనేందుకు నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్యే భూమి అమ్ముతానని ఒక వ్యక్తి దగ్గర డబ్బులు తీసుకుని మరో వ్యక్తికి విక్రయించిన చరిత్ర అని ఆరోపించారు. ఎమ్మెల్యేకు దమ్మొంటే బహిరంగ చర్చకు రావాలని, తేదీ, వేదిక కూడా ఆయననే నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం వితరణ

కోరుట్ల రూరల్: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్పస్వామి,జ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం గోగ్రాసం వితరణ చేశారు. జగిత్యాలకు చెందిన తుదిగేని చక్రవర్తి–వసంత, కోరుట్లకు చెందిన శ్రీకాంత్ ఆవుల ఆహారం కోసం రూ. 3516 చొప్పున ఆలయ గోగ్రాస నిధికి సమర్పించారని ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



షాప్‌లో తనిఖీ చేస్తున్న ఏవో దీపిక, ఎస్సై

ఇబ్రహీంపట్నం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని ఏవో దీపిక, ఎస్సై అనిల్ ఎరువుల దుకాణ యాజమానులకు కోరారు. మండలంలోని గోధూర్‌లో బుధవారం ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. కాలం చెల్లిన విత్తనాలను, ఎరువులను అమ్మవద్దని తెలిపారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా రశీదును ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా

మల్యాల: మండలంలోని రైతులకు అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు అందజేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ అన్నారు. ఇప్పటి వరకు మండలంలో 1530 జీలుగ విత్తనాల బ్యాగులు పంపిణీ చేశామని, ప్రస్తుతం మల్యాల ప్యాక్స్ కేంద్రంలో 300 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గొల్లపల్లి: నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలుంటాయని ఎస్సై సతీశ్ అన్నారు. మండలంలోని వివిధ విత్తన దుకాణాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి కరుణతో కలిసి తనిఖీలు చేపట్టారు. దుకాణాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, స్టాక్ రికార్డులను, బిల్ రికార్డులు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



రైతులు, కూలీలతో మాట్లాడుతున్న ఏవో

సారంగాపూర్: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష, ఏఈవోలు సందీప్, శిరీష అన్నారు. తుంగూర్ అటవీప్రాంతంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద బుధవారం రైతులు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం లైసెన్స్ జారీ చేసిన వారి నుంచే విత్తనాలు, ఎరువులు కొనాలని, కొనుగోలు సమయంలో వాటికి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన హోంగార్డు రాధ కుటుంబానికి ప్రమాద పరిహారం కింద రూ 30 లక్షల చెక్కును బుధవారం అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంకు మేనేజర్ ఎండీ అక్బర్, ఆపరేషన్ మేనేజర్ రామానుజం, సేల్స్ మేనేజర్ ఎండీ సుఫియాన్, యాక్సిస్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఇంటి బయట నిలుచున్న వంగల నర్సవ్వ (65)అనే వృద్ధురాలిపై ఒకేసారి నాలుగు కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.కాగా మండల కేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, వీటిని అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థికి అభినందన

కోరుట్ల: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆకుల సాయి రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం. రామ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వారణాసిలో బీజేపీ నాయకుల ప్రచారం

మేడిపల్లి: ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి నియోజకవర్గంలో మేడిపల్లి బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ కో కన్వీనర్ క్యాతం ధశరథరెడ్డి, మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, అన్నాడి జలపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోమన్‌పల్లిలో కేజీబీవీ నిర్వహణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కోమన్‌పల్లిలో కస్తూర్బా బాలికల విద్యాలయం తరగతులు నిర్వహిస్తారని బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. 2024–25 విద్యాసంవత్సరంలో కస్తూర్బా బాలికల విద్యాలయంలో కోమన్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న పాఠశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడానికి జిల్లా కలెక్టర్ అంగీకరించారని, దీనిపై జిల్లా విద్యాధికారితో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీరప్ప బోనాల్లో ఎమ్మెల్సీ

జగిత్యాల: మండలంలోని లక్ష్మీపూర్‌లో బుధవారం జరిగిన బీరప్ప స్వామి బోనాల పండగ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

గంగమ్మ తల్లికి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గంగపుత్ర సంఘం మహిళలు

జగిత్యాలటౌన్: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాణినగర్,బీట్‌బజార్, తులసీనగర్ ప్రాంతాలకు చెందిన గంగపుత్ర మహిళలు డప్పుచప్పుళ్లు, ఇంటికో బోనం నెత్తిన పెట్టుకుని పట్టణ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కుర్మపెల్లిలో బీరయ్య పట్నాలు



బీరయ్య పట్నాల వద్ద ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్: మండలంలోని కుర్మపెల్లిలో మహంకాళమ్మ బీరయ్య పండుగ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణం,పట్నాలు వంటి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్,బీజేపీ రాష్ట్ర నాయకురాలు భోగ శ్రావణి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరి వెంట ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

ఘనంగా మారేమ్మ దేవత పునఃప్రతిష్ఠాపన

ఇబ్రహీంపట్నం: మండల కేంద్ర శివారులో మారేమ్మ దేవతను బుధవారం ఘనంగా పునఃప్రతిష్ఠాపించారు. విగ్రహాలను పోతరాజుల ప్రత్యేక పూజలతో దేవతలను ప్రతిష్ఠాపించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కథలాపూర్: మండలకేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ ఉన్నత పాఠశాలలో1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు, సహపంక్తి భోజనం చేశారు. ఒకరి యోగ క్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లిలో జెడ్పీటీసీ నిధులతో మంజూరైన బోరును బుధవారం పెద్దమ్మ ఆలయం వద్ద బోర్‌వెల్ వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతల పెల్లి స్వప్న వెంకటేశ్వర్ రెడ్డి, బోంగురాజు, తిరుపతిరెడ్డి, పాల్గొన్నారు.